అపర సంజీవనులకు సర్కారు ఊపిరి

- విశేష సేవలందిస్తున్న 108,104 వాహనాలు
- ఆరోగ్య రథాల పనితీరుపై ప్రజల హర్షం

పెదవేగి: ఆపదలోఉన్న ప్రజల ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తూ అపర సంజీవనులుగా పేరొందిన 108, పల్లె ముంగిట్లోనే వైద్య సేవలందించే 104 వాహన సేవలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ఊపిరి పోశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన 108, 104 సేవలను గత టీడీపీ పాలనలో పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గర్భిణులు లేదా ప్రమాదాల్లో గాయపడినవారిని ఆస్పత్రికి తరలించేందుకు ప్రజ లు చాలా ఇబ్బందులు పడేవారు. 108 సేవలను టీడీపీ సర్కారు తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. 104 సేవలదీ ఇదేపరిస్థితి. ఫోన్ చేసినా 108 వాహనాలు సకాలంలో అందుబాటులోకి రాకపోవడంతో బాధి తులను వారి బంధువులు ఆటోల్లో తరలించాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ప్రజలు ముఖ్యంగా మహిళలు పడిన బాధలు వర్ణనాతీతం. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సేవలను సరికొత్త హంగులతో పునరుద్ధరించారు. నూతనంగా ప్రారంభించిన 108, 104 వాహనాల్లో అధునాతన పరికరాలను సదుపాయా లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇన్నేళ్ల తరు వాత మళ్లీ ప్రభుత్వ ఆరోగ్య రథాలు అందుబాటులోకి రావడం, అందిస్తున్న సేవలపై దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే 108, 104 వాహనాలను ప్రతి మండలానికీ కేటాయించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాణ దాతగా నిలిచారని పలువురు ముక్త కంఠంతో చెబుతున్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని అన్నివర్గాల ప్రజలు అంటున్నారు. కరోనా విపత్కర సమయంలో 108, 104 సేవలను అధునాతన సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





పెదవేగి మండలంలో సేవలందిస్తున్న 108, 104 వాహనాలు

నిరుద్యోగులకు ఉపాధి

ప్రజలకు 104, 108 ద్వారా సేవలందించేందుకు నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ నైపుణ్యం కలిగిన వైద్య సిబ్బందిని ఎంపిక చేసి విధులు విజయవంతంగా కొనసాగిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో 108 వాహనాలు 4ఉండగా, అందులో 20 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 104 వాహనాలు 5ఉండగా, 10మంది సిబ్బందికి ఉపాధి లభించింది. ఇలా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 108 వాహనాలు 50 ఉండగా అందులో 250 మంది పనిచేస్తున్నారు. 104 వాహనాలు 75 ఉండగా వీటిలో 150మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం



గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 108,104 వాహనాలు ఉపయోగపడుతున్నాయి. ఆధునిక సదుపాయాలతో వీటిని మళ్లీ ప్రారంభించడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టారు. అధికారం వచ్చిన దగ్గర నుంచి నేటి వరకు విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

– కేశన సతీష్ వైఎస్సార్ సీపీ పెదవేగి మండల సచివాలయ కన్వీనర్

ప్రజారోగ్యానికి పెద్ద పీట



ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోంది. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడంతో అన్ని వర్గాల వారికీ న్యాయం జరుగుతోంది.

– ముస్సె శ్రీను ద్వారకాతిరుమల దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్

మడమ తిప్పని నేత సీఎం జగన్



ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సౌకర్యాలతో 108, 104 వాహనాలను ప్రారంభించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ముద్ర వేసుకున్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు ఆయనకే సాధ్యం. సీఎం సహకారంతో దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు మండలాల్లో రూ.కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.

– కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు

క్లుప్తంగా

రాష్ట్ర మానవహక్కుల కో కన్వీనర్‌గా సొంగా రవీంద్రప్రసాద్



సొంగా రవీంద్రప్రసాద్

దెందులూరు: మానవ హక్కుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్‌గా ఏలూరు జిల్లా గంగన్నగూడెం గ్రామానికి చెందిన సొంగా రవీంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వీఎస్ రామచంద్రనాయుడు లిఖిత పూర్వక నియామక పత్రాలను అందజేశారు. మానవహక్కుల పరిరక్షణకు రాష్ట్ర కోకన్వీనర్‌గా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్ని జిల్లాల కమిటీలతో సమన్వయంతో సేవలందిస్తానని రవీంద్రప్రసాద్ అన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గొర్రెల మృతి



కొప్పాకలో విద్యుదాఘాతంతో మృతిచెందిన గొర్రెలను చూపుతున్న యజమాని భాస్కరరావు

పెదవేగి : విద్యుదాఘాతంతో మూడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పెదవేగి మండలం పెదకడిమికి చెందిన బాధిత గొర్రెల యజమాని నెరుసు భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం కొప్పాక నుంచి చినబోయినపల్లి వెళ్లే రోడ్డులో గో సంరక్షణ సమితి సమీపంలో గొర్రెలు మేస్తుండగా రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎర్త్ వైరును గొర్రెలు తాకడంతో మూడు జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉంది. దీంతో ఎర్త్ వైరుకు విద్యుత్ ప్రవహించడంతో ఈ ప్రమాదం జరిగిందని గొర్రెల యజమాని భాస్కరరావు తెలిపారు. చనిపోయిన మూడు గొర్రెల విలువ రూ.60వేలని ఆయన చెప్పారు.

అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జేసీ లావణ్యవేణి

దెందులూరు: వచ్చే ఎన్నికల్లో అన్ని శాఖల అధికారులు భారత ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బీ.లావణ్యవేణి అన్నారు. బుధవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో అన్ని శాఖల మండలాధికారులతో ఎన్నికలకు సంబంధించి సూచనలు, సలహాలు తెలియజేసి, నిబంధనలు వివరించారు. ఎన్నికల కోడ్ ప్రకటించిన వెంటనే అంకితభావంతో విధి నిర్వహణ చేయాలన్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు ఎటువంటి అలసత్వం వహించినా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. దెందులూరు తహసీల్దార్ వీ.జితేంద్ర, అధికారులు ఉన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై వీధి నాటిక ప్రదర్శన



వసంతవాడలో వీధి నాటిక ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పెదపాడు: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏలూరు నగరానికి చెందిన కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు వసంతవాడ, వట్లూరులో వీధి నాటకం ప్రదర్శించారు. ఈ నాటిక ద్వారా పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాకారులు ఎం కుమార్, ఎం తిరుపతి, వీ రమేష్, వీ రాజేష్, ఎం సాయి, వి వాణి పాల్గొన్నారు.

ఏడు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

భీమడోలు: మండలంలో ఖాళీగా ఉన్న 7 గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు భీమడోలు ఎంపీడీవో టి.స్వర్ణలత బుధవారం తెలిపారు. ఆగడాలలంకలో ఒక పోస్టును బీసీ-ఏ (మహిళ), అంబర్‌పేటలో ఒక పోస్టును బీసీ-ఏ (జనరల్), పోలసానిపల్లిలో ఒక పోస్టును బీసీ-డీ (జనరల్), సూరప్పగూడెంలో ఒక పోస్టును బీసీ-ఏ(జనరల్), భీమడోలు సచివాలయం 2 పరిధిలో ఒక పోస్టును బీసీ-డీ (జనరల్), గుండుగొలనులో ఒక పోస్టును ఎస్సీ జనరల్, చెట్టున్నపాడులో ఒక పోస్టును ఎస్సీ జనరల్‌కు కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు. పదో తరగతి పాసై, 35ఏళ్ల లోపు యువతీ యువకులు ఈ నెల 25వతేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నమో దు చేసుకోవాలన్నారు. ఈనెల 27న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. అర్హులు గల వారంతా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రజలకు సుఖ సంతోషాలు



అంబర్‌పేటలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రజలకు సుఖ సంతోషాలు లభిస్తాయని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. అంబర్‌పేటలో తిరుమల తిరుపతి దేవస్థానం నిధుల నిధులు రూ.15 లక్షలతో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల నిర్మాణానికి పెద్ద పీట వేస్తుందన్నారు. మండలంలోని ఏన్నే జీర్ణోద్ధరణ చెందిన ఆలయాలను రూ.కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఆలయాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, సర్పంచ్ ఏపూరి భానుదీపిక, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, ఎంపీటీసీలు విజయభాను, ఆజామ్, ఆర్‌బీకేల చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు రామిశెట్టి శ్రీనివాసరావు, బాబూరావు, నాయకులు ఏపూరి రాంబాబు, పి.నాగు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం



పెదయాగనమిల్లిలో రూ.21 లక్షలతో నిర్మించిన వైఎస్‌ఆర్ క్లినిక్ భవనం

ఏలూరు రూరల్: పెదయాగనమిల్లి మారుమూల కొల్లేరు గ్రామం. ఐదేళ్ల క్రితం వరకూ ఆసుపత్రికి లేదా ఉద్యోగ, విద్యావసరాలకు ఇక్కడి ప్రజలు ఏలూరుకు పరుగులు తీయాల్సిందే. గోతులమయమైన మట్టి రోడ్లపై ప్రయాణం నరకప్రాయం. నేడు ఆ పరిస్థితి మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో గ్రామంలో అభివృద్ధి పరుగులు తీసింది. స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు అధికారులు రూ.60 లక్షలతో అధికారులు సీసీ రోడ్లు పనులు పూర్తి చేశారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు పరివేక్షణలో రూ.38 లక్షలతో సచివాలయం, మరో రూ.21 లక్షలతో వైఎస్‌ఆర్ క్లినిక్ భవనాలు పూర్తి చేసారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేయడంతో ప్రభుత్వం గ్రామాభివృద్ధి కోసం మరో రూ.20 లక్షలు మంజూరు చేయడంతో వాటితో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులపై సర్పంచ్ బలే నాగసులోచన, ఉప సర్పంచ్ సైదు విజయలక్ష్మితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు బలే నాగరాజు గ్రామ పెద్దలు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విద్య, వైద్యం, రోడ్లు, ప్రభుత్వ పాలన అంతా గ్రామానికే వచ్చాయని స్థానిక ప్రజలు సంబరపడుతున్నారు.



రూ. 38 లక్షలతో పూర్తి చేసిన సచివాలయ భవనం

వేమన్న గ్రంథాలయాభివృద్ధికి రూ.లక్ష మంజూరు

దెందులూరు: వేమన్న గ్రంథాలయాన్ని, కేఎన్ పురంతో పాటు సమీపంలోని చిన్నారులు, యువత సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, ఎంపీడీఓ పీ.శ్రీలత అన్నారు. బుధవారం ముప్పవరం పంచాయతీ కేఎన్ పురంలో వేమన్న గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పుస్తకాలను సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్ ఆవిష్కరించారు. గ్రంథాలయంలో పుస్తకాల ఏర్పాటు కోసం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ రూ.లక్ష నిధులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రేమ్‌కుమార్, పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కేఎన్ పురం వేమన్న గ్రంథాలయంలో పుస్తకాలను ఆవిష్కరించిన దృశ్యం

నేడు సర్వసభ్య సమావేశం

పెదపాడు: పెదపాడు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో జే తేజరతన్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధు లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

టైలర్ సర్వేశ్వరరావు మృతి

ఉంగుటూరు: ఉంగుటూరులోని బోంబే టైలర్ చింతలపూడి సర్వేశ్వరరావు (75) బుధవారం హైదరాబాదులో కన్నుమూశారు. ఈయన వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమాని. ప్రస్తుతం వైఎస్సార్ సీపీలో పని చేస్తున్నారు. స్థానిక టైలర్లు, అభిమానులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహాల పునఃప్రతిష్ఠ

- స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- తరలి వచ్చిన భక్తులు
- స్వామి వారికి విశేష పూజలు

భీమడోలు: అంబర్‌పేటలోని స్వయంభూ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం, దేవతామూర్తుల విగ్రహాల పునఃప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం కనుల పండువలా నిర్వహించారు. బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని ఆధ్వర్యంలో యాజ్ఞిక, రుత్విక బృందం, అర్చక స్వాములు మేడూరి ఏడుకొండలు, మేడూరి శ్రీనివాసరావు వేద మంత్రోచ్చరణల నడుమ విగ్రహాల ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, దేవదాయ ధర్మశాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. వారికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన రామలింగేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చొరవతో దేవదాయ ధర్మశాఖ డీసీ మేడేపల్లి విజయరాజు సీజీఎఫ్ నిధులు రూ.30 లక్షలు మంజూరు చేయించారు. దీనితో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. డిప్యూటీ కమిషనర్ ఆర్థిక సాయంతో మూడు రోజులుగా విగ్రహాల పునః ప్రతిష్ఠ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శివ పార్వతీ, గణపతి, నాగబంధ, ఆంజనేయస్వామి, నందీశ్వర, చండీశ్వర విగ్రహాలను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయ ప్రదక్షణాలు చేసారు. మేడేపల్లి విజయరాజు స్వామి వారికి నూతన వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేసారు. భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ఆలయం కిటకిటలాడింది. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సహాయ కమిషనర్లు సీహెచ్ రంగారావు, ఈదుల సుబ్బారావు, సర్పంచులు ఏపూరి భానుదీపిక, గుడివాడ నాగగౌతమి, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, మండల ఇన్‌చార్జి పుప్పాల కార్తీక్, ఆర్‌బీకేల చైర్మన్ పి.సత్యనారాయణ, ఎంపీటీసీలు విజయభాను, ఆజామ్, ముళ్లగిరి జాన్సన్, నాయకులు రావిపాటి గాంధీ, తుమ్మగుంట రంగ, గ్రామ పార్టీ అధ్యక్షుడు రామిశెట్టి శ్రీనువాసరావు, బాబూరావు, పి.నాగు, ఈవో ఎం.రాధ, భీమవరం, తణుకు ఏరియాల తనిఖీ అధికారులు, ఈవోలు, స్థపతులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబర్‌పేటలో విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవంలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



ఆలయ ప్రదక్షిణలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు, ఆలయ ఏసీలు, ఈవోలు

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక సమావేశం

భీమడోలు: భీమడోలు వీసీ కన్వెన్షన్ హాల్లో ఈనెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా ఈఈ జేసీబీ నగరాజన్ బుధవారం తెలిపారు. ఈ పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫోరం చైర్‌పర్సన్, వినియోగదారుల గ్రీవెన్స్ ఫోరం, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ హాజరవుతారన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ సమ్యలను ఫోరం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. సమస్యలతో పాటు నిర్వహణపై తగు సూచనలను అందిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

దెందులూరు: విజయరాయి గ్రామానికి చెందిన కానూరి శ్రీనివాస్ అనారోగ్యంతో ఏలూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బుధవారం ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులకు మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు. ఖండ్రికనర్సింహపురం సరిపల్లి కుటుంబరావును వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

ఆర్‌బీకేలు.. అన్నదాతల సమస్యల పరిష్కార వేదికలు



యర్రమళ్లలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న సర్పంచి ఏలేటి సునీత, చిత్రంలో ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: రైతుల అవసరాలు తీర్చేందుకు, వారి సమస్యలకు పరిష్కార వేదికగా రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం నిర్మిస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఉంగుటూరు మండలం నాచుగుంట పంచాయతీ యర్రమళ్లలో రూ.23.94 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని సర్పంచి ఏలేటి సునీతతో ఎమ్మెల్యే వాసుబాబు బుధవారం ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలు తలెత్తుకుని తిరిగేలా ఒక ప్రభుత్వ కార్యాలయం నిర్మించాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆలోచించి కార్యచరణ చేపట్టిందని అన్నారు. విత్తు మొదలుకుని పంట విక్రయించే వరకు ప్రభుత్వ పరంగా ఈ కార్యాలయంలో వ్యవసాయ సహాయకుడు అందుబాటులో ఉండి రైతులకు సేవలందజేస్తారని వాసుబాబు వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు కలిగిన మేలును వాసుబాబు వివరించారు. ఆర్‌బీకేలోని పలు గదులను స్థానిక నాయకులతో ప్రారంభింపజేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుబాబుతోపాటు, మండల పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సర్పంచి ఏలేటి సునీత, నాయకులు కేశగాని సుబ్బారావు, పొన్నాడ మునేశ్వరరావు, నెరుసు పుల్లయ్య, ఏలేటి సురేష్, ఏలేటి సుబ్బారావు, బొప్పిడి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత



కొవ్వలి ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం నిర్వహిస్తున్న హెచ్ శర్మ

దెందులూరు: తెలుగు భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగు భాష మాధుర్యాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కొవ్వలి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్‌వీజీశర్మ అన్నారు. బుధవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో మాతృ భాషా దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించి తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. తెలుగు భాష ఔన్నత్యంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు అన్నారు.



గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో తెలుగు దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మాతృభాషతోనే పురోగతి

గణపవరం: మాతృభాషపై పట్టు సాధిస్తే ప్రపంచంలోని అన్ని భాషల్లో ప్రావీణ్యం సంపాదించవచ్చునని, అందువల్ల ప్రతి ఒక్కరూ మాతృభాషపై దృష్టి సారించాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం కళాశాల తెలుగువిభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ తెలుగుభాషపై ప్రతీ విద్యార్థి ఆసక్తి పెంచుకోవాలన్నారు. తెలుగుభాష గొప్పదనాన్ని తెలుసుకోవాలన్నారు. ఐక్యూఏసీ సమన్వయకర్త చైతన్య, తెలుగు విభాగం అధ్యక్షుడు జి.వెంకటరమణ మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.అక్కిరాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు తెలుగు భాష గొప్పదనంపై వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

నారాయణపురం ఎస్ఏఎస్ డిగ్రీ కళాశాలలో..

ఉంగుటూరు: నారాయణపురం ఎస్ఏఎస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అధ్యక్షతన బుధవారం మాతృభాషాదినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు బాష గొప్పతనాన్ని అధ్యాపకులు వివరించారు. తెలుగు అధ్యాపకులు డా.కొండరవి మాట్లాడుతూ తెలుగు భా గొప్పతనాన్ని, పలు ఘట్టాలను వివరించారు.

అమ్మ భాషను పరిరక్షించుకోవాలి

భీమడోలు: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు, జీవన విధానాలకు మూలధారమైన మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మండే సుధాకర్ మాట్లాడుతూ మాతృభాష మాధుర్యాన్ని తల్లిదండ్రులతో పాటు, విద్యార్థులు గుర్తించాల న్నారు. వివిధ పాఠశాలల చిన్నారులు, సిబ్బంది పాల్గొన్నారు.